క్లుప్తంగా

రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి కృషి



పోతునూరులో డీలర్లతో కలిసి మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు మండాది వెంకట్రావు

దెందులూరు: రాష్ట్రంలో రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారం, ఉద్యోగ భద్రత, కుటుంబ సభ్యుల సంక్షేమం, అభివృద్ధికి శాశ్వత పరిష్కారం కోసం యూనియన్ పరంగా కృషి చేస్తున్నామని రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మండాది వెంకట్రావు అన్నారు. బుధవారం పోతునూరులో సంఘం జిల్లా అధ్యక్షుడు తలారి రామకృష్ణ, కార్యదర్శి హృదయేశ్వర రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు జయరాజు, డివిజనల్ అధ్యక్షుడు రాజశేఖర్ ఆధ్వర్యంలో దెందులూరు మండల రేషన్ డీలర్ల అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు తలారి రామకృష్ణ మాట్లాడుతూ విజయవాడలో జూలై 23న సింగ్‌నగర్ మాకినేని బసవ పున్నయ్య స్టేడియంలో రాష్ట్రస్థాయి రేషన్ డీలర్ల సమావేశం జరుగుతుందన్నారు. సమావేశానికి డీలర్లు అందరూ హాజరుకావాలన్నారు. దెందులూరు మండల నాయకులు వేముఆరోగ్యం, బాలిన నాగు, గవ్వా రాంబాబు, ఝాన్సీ, దుర్గానాగరాజు పాల్గొన్నారు.

కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ నిర్మాణం



సోమవరప్పాడులో నిర్మించిన శానిటరీ కాంప్లెక్స్

దెందులూరు: సోమవరప్పాడులో స్వచ్ఛ భారత్ మిషన్ నిధులు రూ. 3 లక్షలు వెచ్చించి నిర్మించిన కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ పూర్తయింది. ప్రతి గ్రామ సచివాలయం సమీపంలో శానిటరీ కాంప్లెక్స్ నిర్మించాలన్న ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నిర్మాణం పూర్తయిందని గ్రామ కార్యదర్శి ముంగర శ్రీకాంత్ అన్నారు. పూర్తి నాణ్యతా ప్రమాణాలతో నిర్మించినట్టు ఆయన వివరించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు

భీమడోలు: మండలంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన ముగ్గురు లారీ డ్రైవర్లు, ఒక ఆటో వాలాకు భీమడోలు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి పీఏఎస్ఎస్ఆర్‌కే ఆదిత్య ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు నిచ్చింది. ఈ మేరకు వివరాలను ఎస్సై చావా సురేష్‌కుమార్ వెల్లడించారు.

పేదల మేలు జగనన్న సురక్ష లక్ష్యం

కోఆప్షన్ సభ్యుడు పెదబాబు




ఎంఆర్‌సీ కాలనీలో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న కోఆప్షన్ సభ్యుడు పెదబాబు, 7వ డివిజన్‌లో మహిళ నుంచి బయోమెట్రిక్ తీసుకుంటున్న దృశ్యం

ఏలూరు టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదలకు మేలు చేయాలనే సంకల్పంతో అర్హులందరికీ సంక్షేమ పథకాలు ఇవ్వాలనే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని ఏలూరు నగరపాలక సంస్థ కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు అన్నారు. ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని సారథ్యంలో ఏలూరు 50వ డివిజన్ ఎంఆర్‌సీ కాలనీలో ఆయన ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అనేది ఆరా తీశారు. 11 రకాల సర్టిఫికెట్ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మణిపూరి కుమారి అనే మహిళ కరెంట్ బిల్లు అధికంగా రావటంతో తమకు అమ్మఒడి పథకం ఆగిందని చెప్పారు. చింతాడ లక్ష్మి అనే మహిళ తమ పిల్లలకు ఆదాయం, కుల ధ్రువీకరణ పత్రాలు కావాలని కోరారు. ఇప్పిలి వెంకటేశ్వర ప్రసాద్ అనే వ్యక్తి తనకు వివాహమైందని సర్టిఫికెట్ కావాలని కోరారు. వారి చిన్నారి భవిజ్ఞ మనస్వినికి జనన ధ్రువీకరణ పత్రంలో పేరుతేడా పడిందని, సరిచేయాలని కోరారు. కలిపిల్లి లక్ష్మణరావు - లక్ష్మి దంపతులు తమకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని, గతంలో రేషన్‌కార్డు కోసం ఎంత తిరిగినా రాలేదనీ, సీఎం జగనన్న ప్రభుత్వంలో రేషన్‌కార్డు వచ్చిందని ఆనందం వ్యక్తం చేశారు. తమకు ఓటు గుర్తింపు కార్డు కావాలని కోరారు. ఈ సమస్యలన్నీ జూలై 4న పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని కోఆప్షన్ సభ్యుడు పెదబాబు హామీ ఇచ్చారు. ఈ ప్రాంతంలో 85 శాతం మంది ప్రజలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందిస్తోన్న సంక్షేమ పథకాలన్నీ అందుతున్నాయని సంతోషం వ్యక్తం చేశారని పెదబాబు తెలిపారు. ప్రజల సమస్యలన్నీ పరిష్కరించి సర్టిఫికెట్లు ఉచితంగా అందజేస్తామని చెప్పారు. ఆయనతోపాటు డిప్యూటీ కమిషనర్ ఎస్.రాధ, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

ప్రతి పేదవానికీ సంక్షేమ ఫలాలు అందించటమే ప్రధాన లక్ష్యంగా ఎమ్మెల్యే ఆళ్ల నాని సారథ్యంలో పనిచేస్తున్నామని, అర్హులందరికీ పథకాలు అందించే ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్షను అమలు చేస్తున్నారని ఏడో డివిజన్ కార్పొరేటర్ పిల్లంగోళ్ల శ్రీదేవి అన్నారు. ఏలూరు వన్‌టౌన్‌లో 7వ డివిజన్ పరిధిలో పలు ప్రాంతాల్లో బుధవారం జగనన్న సురక్ష సర్వే నిర్వహించారు. వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ సిబ్బంది, సచివాలయ కన్వీనర్లతో కలిసి ఆమె ప్రతి ఇంటికీ వెళ్లి సమస్యలు ఏమైనా ఉన్నాయా, ప్రభుత్వం అందిస్తోన్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అనేది అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ శ్రీదేవి మాట్లాడుతూ ప్రజలకు మంచి చేయాలనే ఉన్నత లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల కుటుంబాల్లో వెలుగులు నింపాలనే ఉద్దేశంతో అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. సమాజంలో పేదల కుటుంబాల్లో 85 శాతం మంది సంక్షేమ పథకాలు తీసుకుంటున్నారని, మిగిలిన వారికీ పథకాలు అందించేందుకు తమవంతు పాత్ర పోషిస్తున్నామని వివరించారు.

యాదవుల దిక్సూచి ములాయంసింగ్



పోస్టర్ విడుదల చేస్తున్న యాదవ సంఘం నాయకులు

ఏలూరు (టూటౌన్): దేశంలోని యాదవులకు దిక్సూచి లాంటి వ్యక్తి సమాజ్‌వాదీ పార్టీ వ్యవస్థాపకుడు, మాజీ కేంద్ర రక్షణ మంత్రి ములాయంసింగ్ యాదవ్ అని అఖిలభారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు చిదరబోయిన శ్రీనివాసరావు అన్నారు. స్థానిక తమ్మిలేరు ఏటిగట్టులోని జిల్లా యాదవ సంఘం కార్యాలయంలో బుధవారం ములాయంసింగ్ యాదవ్ విగ్రహావిష్కరణ, బహిరంగ సభకు సంబంధించిన వాల్‌పోస్టర్, కరపత్రాలను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ గుంటూరు - విజయవాడ హైవే పక్కన కాజా టోల్‌ప్లాజా సమీపంలో ములాయంసింగ్ యాదవ్ విగ్రహాన్ని జూలై 9వ తేదీ మధ్యాహ్నం 3.30 గంటలకు ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్‌యాదవ్ ప్రారంభించనున్నట్టు వెల్లడించారు. అనంతరం నాగార్జున విశ్వవిద్యాలయం ఎదురుగా ఉన్న గ్రౌండ్‌లో భారీ బహిరంగ సభ ఉంటుందని, సభకు రాజకీయాలకు అతీతంగా జిల్లాలోని యాదవులంతా హాజరుకావాలని కోరారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉక్కుసూరి గోపాలకృష్ణ మాట్లాడుతూ ములాయంసింగ్‌యాదవ్ విగ్రహానికి అయ్యే ఖర్చు రూ.8.50 లక్షలను విరాళంగా అందించిన పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో అఖిల భారత యాదవ మహాసభ ఏలూరు జిల్లా గౌరవాధ్యక్షుడు కిలారపు బుజ్జి, రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి మల్లిపూడిరాజు, జిల్లా కోశాధికారి గొర్ల రామారావు, ఏలూరు నగర అధ్యక్షుడు బొట్టా అజయ్, ఏలూరు నియోజకవర్గ అధ్యక్షుడు ఆకుల గంగాధరరావు, జిల్లా నాయకులు కట్టా ఈశ్వరరావు, చిలకంటి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాన్ని అభివృద్ధి చేయాలి



రంగారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

ఏలూరు (టూటౌన్): ప్రముఖ అభ్యుదయవాది, సీపీఐ అభిమాని బొమ్మి రంగారావు ఆశయాలకు అనుగుణంగా కొత్తపేట గ్రంథాలయాన్ని అభివృద్ధి చేయాలని సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక కొత్తపేట బొమ్మి రంగారావు స్మారక గ్రంథాలయం వద్ద ఆయన 28వ వర్ధంతి కార్యక్రమం బొమ్మి రంగారావు ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. రంగారావు చిత్రపటానికి ఆయన తనయుడు, ట్రస్టు బోర్డు చైర్మన్ బొమ్మి మురళి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ బోర్డు కార్యదర్శి చింతల సూర్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గత 48 ఏళ్ళుగా కొత్తపేటలో సీపీఐ, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో గ్రంతాలయం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఏఐటీయూసీ నాయకులు కడుపు కన్నయ్య, పుప్పాల కన్నబాబు, ట్రస్ట్ అధ్యక్ష కార్యదర్శులు బొమ్మి మురళి, చింతల సూర్యనారాయణలు మాట్లాడారు. చోడిదిబ్బ నర్సింహం మున్సిపల్ ప్రాథమిక ఉన్నత పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు బహూకరించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఆర్నేపల్లి మధు, సీపీఐ నాయకులు చింతల దాలినాయుడు, గేదెల నాగేశ్వరరావు, తొత్తల రాము, పాల రామకృష్ణ, కోలా భాస్కర్, కనకం జగన్‌రెడ్డి, పాల జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

తొలి ఏకాదశి పూజలకు సర్వం సిద్ధం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా నగరంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తిచేశారు. స్థానిక పాత బస్టాండు వద్ద ఉన్న పాండురంగ స్వామి దేవస్థానంలో గురువారం ఉదయం సామూహిక శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి వ్రతాలు, తులసి దళాలతో పాండురంగ స్వామి, లక్ష్మీ నారాయణ స్వామి, సీతారామ స్వామి వార్లకు అర్చన నిర్వహించనున్నారు. పాండురంగ స్వామి శ్రీ త్రివిక్రమునిగా (వామనావతారంలో) దర్శనమిస్తారు. సాయంత్రం రుక్మాబాయి సమేత పాండురంగ స్వామి శాంతి కల్యాణం నిర్వహించనున్నారు. 30వ తేదీన చక్రానికి పంచామృత అభిషేకం, మంగళ ద్రవ్యాలతో అభిషేకం, అనంతరం అమ్మవారికి ఖడ్గమాలతో విశేష అర్చన, సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించనున్నారు. జూలై 1న శనిత్రయోదశి సందర్భంగా శనైశ్వర స్వామి వ్రతాలు, విశేష అలంకార దర్శనం, శనీశ్వరునికి అభిషేకాలు నిర్వహించనున్నారు. సాయంత్రం మినీ సుందరకాండ పారాయణం, హనుమాన్ చాలీసా పారాయణ చేస్తారు. 2న సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి విశేష అభిషేకాలు, అనంతరం శ్రీ బాలా త్రిపుర సుందరి దేవికి అభిషేకాలు, విశేష కుంకుమార్చన, పుష్పార్చన నిర్వహిస్తారు. 3న గురుపౌర్ణమి సందర్భంగా షిర్డీ సాయి నాథుని సత్యవ్రతాలు, సాయి గురుదత్త హోమం, సాయంత్రం బాబాకు చావడి ఉత్సవం, జ్యోతిర్లింగార్చన, దర్బారు సేవ నిర్వహించనున్నారు. దొండపాడు శ్రీనం దత్తనాథ క్షేత్రంలో ఉదయం 10 గంటలకు భక్తులచే సామూహిక శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి వ్రతాలు అచరించనున్నారు.

జగనన్న సురక్ష సర్వేతో అర్హులకు పథకాలు

పెదవేగి : జగనన్న సురక్ష సర్వే ద్వారా సాంకేతిక కారణాల వల్ల పథకాలు అందని అర్హులను గుర్తించి వారికి న్యాయం చేస్తామని పెదవేగి ఎంపీపీ తాతా రమ్య అన్నారు. పెదవేగి మండలంలో నిర్వహిస్తున్న జగనన్న సురక్ష సర్వేలో అధికారులు, సచివాలయ సిబ్బంది, గృహ సారథులు చురుగ్గా పాల్గొంటున్నారని ఆమె అన్నారు. గ్రామాల్లోని ప్రతి కుటుంబాన్ని కలిసి సచివాలయాల ద్వారా అందిస్తున్న ఉచిత సేవలపై అవగాహన కల్పించనున్నట్టు తెలిపారు. పెదవేగి మండలంలో సర్వే చురుగ్గా సాగుతోందని ఎంపీడీఓ జి రాజ్‌మనోజ్ చెప్పారు. బుధవారం మండలంలోని అమ్మపాలెం, పెదవేగిలో ఎంపీపీ తాతా రమ్య సారథ్యంలో ఎంపీడీవో రాజ్ మనోజ్ నేతృత్వంలో నిర్వహించిన సర్వేలో పంచాయతీ కార్యదర్శులు మహిళా సంరక్షణాధికారులు, గృహసారథులు పాల్గొన్నారు.

1 నుంచి అల్లూరి స్మారక నాటిక పోటీలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక హేలాపురి కళా పరిషత్, హిందూ యువజన సంఘం సంయుక్త ఆధ్వర్యంలో జూలై 1 నుంచి నాలుగు రోజుల పాటు అల్లూరి సీతారామరాజు స్మారక ఆహ్వాన నాటిక పోటీలు నిర్వహించనున్నట్టు ఆ సంస్థల ప్రతినిధులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక వైఎంహెచ్ఏ హాలులో శనివారం సాయంత్రం ప్రారంభ సభ అనంతరం నాటికల ప్రదర్శన మొదలౌతుందని, ఈ పోటీల్లో నిత్యం రెండు నాటికలు ప్రదర్శిస్తారని వివరించారు. తొలి రోజు ఉమా ఆర్ట్స్ (కాకినాడ) ఆధ్వర్యంలో కీర్తి శేషులు నాటిక అనంతరం రాత్రి 7.30 గంటలకు హేలాపురి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మనసున మనసై నాటికలు ప్రదర్శిస్తారని తెలిపారు. 2న సాయంత్రం 6 గంటలకు అరవింద ఆర్ట్స్ (తాడేపల్లి) ఆధ్వర్యంలో వెండి అంచులు నాటిక, విశాఖపట్నం తెలుగు కళా సమితి ఆధ్వర్యంలో నిశ్శబ్దమా నీ ఖరీదెంత నాటిక, రాత్రి 8 గంటలకు పొన్నూరు రసఝరి ఆధ్వర్యంలో కాపలా నాటిక ప్రదర్శిస్తారని పేర్కొన్నారు. 3న సాయంత్రం 6.30 గంటలకు కళానికేతన్ (వీరన్నపాలెం) ఆధ్వర్యంలో స్థిరాస్తి నాటిక, రాత్రి 7.30 గంటలకు శర్వాణి గ్రామీణ గిరిజన సాంస్కృతిక సేవా సంఘం (శ్రీకాకుళం) ఆధ్వర్యంలో కొత్త పరిమళం నాటిక ప్రదర్శిస్తారని తెలిపారు. ఆఖరి రోజు 4న లక్ష్మీస్ ఎన్‌టీఆర్ చిత్రం ప్రధాన పాత్రధారి పి.విజయ కుమార్ హరిశ్చంద్రునిగా, కల్యాణి చంద్రమతిగా సత్యహరిశ్చంద్ర కాటి సీను ప్రదర్శిస్తారని, రాత్రి 7.30 గంటలకు ఏలూరు నగరానికి చెందిన వి.రామాంజనేయులు రామునిగా, మండవ రాజగోపాలకృష్ణ ఆంజనేయునిగా రామాంజనేయ యుద్ధం నాటికలో యుద్ధ సన్నివేశం ప్రదర్శిస్తారని తెలిపారు. అనంతరం బహుమతి ప్రదానోత్సవం ఉంటుందని వివరించారు.

నాడు-నేడు పనుల తనిఖీ



దెందులూరు ప్రాథమిక పాఠశాలలో జగనన్న విద్యా కానుక కిట్లు అందజేసిన ఎంఈఓ అన్నమ్మ

దెందులూరు: నాడు-నేడు, మధ్యాహ్న భోజనం పథకాలకు రాష్ట్ర ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యతనిస్తోందని దెందులూరు ఎంఈఓ-2 అన్నమ్మ అన్నారు. బుధవారం దెందులూరులో ప్రాథమిక పాఠశాలలో ఆమె నాడు-నేడు, మధ్యాహ్న భోజనం, జగనన్న విద్యా కానుక పథకాల అమలు తీరును తనిఖీ చేశారు. విద్యార్థుల అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. పథకాల అమలు తీరు, లక్ష్యాల సాధనపై ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. పాఠశాలలో 67 మంది విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను ఎంఈఓ అందజేశారు.

ఉపాధి పనులపై సోషల్ ఆడిట్

దెందులూరు: దెందులూరు మండలంలోని 17 పంచాయతీల్లో జాతీయ ఉపాధి హామీ పథకం సోషల్ ఆడిట్ నిర్వహించినట్టు సోషల్ ఆడిట్ పర్యవేక్షణ టీం లీడర్ స్టేట్ రిసోర్స్ పర్సన్స్ సీహెచ్ రామచంద్రరావు తెలిపారు. బుధవారం దెందులూరులో ఏపీఓ కార్యాలయంలో మాట్లాడుతూ 2022 ఏప్రిల్ 1వ తేది నుంచి ఈ ఏడాది మార్చి 31వ తేదీ వరకు నిర్వహించిన జాతీయ ఉపాధి హామీ పథకానికి సంబంధించి సోషల్ ఆడిట్ నిర్వహిస్తామన్నారు. దెందులూరు మండలంలో ఈ ఆర్థిక సంవత్సరానికి రూ. 26,89,94,303 నగదుకు సంబంధించి సోషల్ ఆడిట్ జరిగిందని ఉపాధి హామీ పథకం ఏపీఓ దశరథ రామ్‌జీ తెలిపారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	70	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	30	చిక్కుడు కాయలు	--
వంకాయలు (కాంతులు)	40	చామదుంపలు	44
వంకాయలు (తెలుపు)	36	ములక్కాడలు	07-10
బెండకాయలు	46	కంద	48
పచ్చిమిర్చి	80-94	బీట్‌రూట్	38
కాకర కాయలు	56	కీరా దోస	44
బీరకాయలు	40	ఫ్రెంచ్‌బీన్స్	--
బీరకాయలు (పందిరి)	58	అల్లం	220
క్యాబేజీ	26	కొత్తిమీర (కట్ట)	20-35
క్యారెట్	36	పాలకూర	12
దొండకాయలు	30	చుక్కకూర	12
బంగాళదుంపలు	20	తోటకూర	10
ఉల్లిపాయలు	20	గోంగూర	12
గోరుచిక్కుడు	48	పుదీనా	05
దోసకాయలు	24	బఠాణి	--
ఆనబకాయ (1)	15	క్యాప్సికమ్	84
పొట్లకాయ(1)	15	చిలకడదుంప	24

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	33
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	36
ఏలూరు - బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	39
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	34

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	20
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	28
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	23
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	27
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	27
ఏలూరు - బీహెచ్ఈఎల్	22.15	34820	30
ఏలూరు -బీహెచ్ఈఎల్	09.00	4794	34
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	34
ఏలూరు -తిరుపతి	16.00	4830	33

రహదారుల ఆధునికీకరణ పనులు వేగవంతం



వట్లూరులో రహదారుల పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ

పెదపాడు: నియోజకవర్గం పరిధిలో రహదారుల ఆధునికీకరణకు చర్యలు వేగవంతం చేశామని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. మండలంలోని వట్లూరులో ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, అధికారులతో కలిసి విస్తృతంగా పర్యటించారు. జిల్లా రైసు మిల్లర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు ఆళ్ల సతీష్ చౌదరి గ్రామంలో పలు అభివృద్ధి పనులు, పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. తొలుత జాతీయ రహదారి నుంచి సీతారామపురం మీదుగా జీఎన్‌టీ రోడ్డు వరకు రూ.3.2 కోట్లతో నిర్మించనున్న 4.1 కిలోమీటర్ల రోడ్డును ఎమ్మెల్యే పరిశీలించారు. ఎఫ్‌డీఆర్ నూతన టెక్నాలజీని ఉపయోగించి ఈ రోడ్డును నిర్మిస్తామన్నారు. నెల రోజుల్లో అంచనాల ప్రక్రియ పూర్తయిన వెంటనే రోడ్డు నిర్మాణం ప్రారంభిస్తామని అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే అమ్మపాలెం, వట్లూరు, సీతారామపురం, భోగాపురం, అంజలిపురం, ఏలూరు ఇంజనీరింగ్ కాలేజికి దగ్గర దారి అవుతుందని, వ్యవసాయ ఉత్పత్తులు రవాణాకు, వైద్యపరంగా ఉపయుక్తంగా ఉంటుందని సతీష్ వివరించారు. అనంతరం వట్లూరు ఐటీఐ నుంచి వట్లూరు కూడలి వరకు నిర్మించనున్న రహదారిని ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం వట్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. హైస్కూల్‌కు ప్రహరీ నిర్మాణంపై కలెక్టరుతో మాట్లాడతానని ఎమ్మెల్యే వివరించారు. వట్లూరు రైల్వే ఓవర్ బ్రిడ్జికి ఒక వైపు అప్రోచ్ రహదారి ఉందని రెండో వైపు నిర్మాణానికి చర్యలు చేపట్టేందుకు ఆర్‌అండ్‌బీ అధికారులతో మాట్లాడాతానన్నారు. అనంతరం అక్కడే ఉన్న సీఆర్ఆర్ మహిళా కళాశాల విద్యార్థులతో ఆయన మాట్లాడారు. ఆర్‌టీసీ అధికారులతో మాట్లాడి బస్సులు ఆగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కళాశాల వద్ద బస్ షెల్టర్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు ఏఎంసీ అధ్యక్షుడు అప్పన ప్రసాద్, వట్లూరు గ్రామ కార్యదర్శి మేకా శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి పరామర్శ

పెదవేగి : పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు అన్ని వర్గాల్లో ధైర్యం నింపి అండగా నిలిచిన వ్యక్తి మెట్టపల్లి సూరిబాబు అని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. పెదవేగి మండలం కూచింపూడి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు మెట్లపల్లి సూరిబాబు ఇటీవల కంటి శస్త్రచికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న ఆయన్ని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి పరామర్శించి, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఉన్నారు.

దెందులూరు- అలుగులగూడెం గ్రామాలకు ఎమ్మెల్యే హామీ

దెందులూరు: దెందులూరు- అలుగలగూడెంలో అభివృద్ధి కార్యక్రమాల అభివృద్ధికి ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి వరాలజల్లు కురిపించారు. బుధవారం ఎమ్మెల్యే కార్యాలయంలో దెందులూరు గ్రామ పార్టీ అధ్యక్షుడు పోకల రాంబాబు ఎమ్మెల్యేను కలిశారు. దెందులూరులో ఇంద్రవనం రోడ్లు, పెదదళిత పేటలో రోడ్లు, డ్రెయిన్లు, కాశీ కాలనీలో డ్రెయిన్ల నిర్మాణం, అలుగులగూడెం కమ్యూనిటీ హాలు, ఆర్వో ప్లాంట్ ప్రారంభోత్సవం తదితర అంశాలు వివరించారు. ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ జిల్లా పరిషత్ నిధులు, ఎమ్మెల్యే ఫండ్స్ నుంచి నిధులు కేటాయిస్తానని రాంబాబుకు హామీ ఇచ్చారు. మిగిలిన అభివృద్ధి పనులు కూడా ప్రాధాన్యతాక్రమంలో చేయిస్తానని ఎమ్మెల్యే అన్నారు. దెందులూరు-కాకికాలని, అలుగులగూడెంలో అభివృద్ధి పనుల నిధుల మంజూరు, ప్రారంభోత్సవాలపై హామీ ఇచ్చిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్యే పరామర్శలు

పెదవేగి : కుటుంబంలో వ్యక్తి కోల్పోవడం ఎవ్వరూ తీర్చలేని బాధని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. పెదవేగి మండలం భోగాపురానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త మరీదు నాగబాబు ఇటీవల మరణించగా బుధవారం వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి పరామర్శించి, అండగా ఉంటామని భరోసా కల్పించారు. భోగాపురంలో అబ్బదాసరి రంగారావు మరణించగా ఆయన భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కూచింపూడిలో వైఎస్సార్ సీపీ కార్యకర్త మువ్వల ఆనందరావు మరణించగా ఆయన భౌతిక కాయానికి పూలమాలలు వేసిన అబ్బయ్యచౌదరి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్, టేబుల్ టెన్నిస్‌లో ముగిసిన శిక్షణ



కొవ్వలి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసిన హెచ్ఎం శర్మ

దెందులూరు: శిక్షణ పొందిన క్రీడల్లో జిల్లా రాష్ట్రస్థాయిలో ప్రతిభను చాటుకుని ఉన్నత స్థితికి చేరుకోవాలని కొవ్వలి ఉన్నత పాఠశాల హెచ్ఎం శర్మ అన్నారు. బుధవారం కొవ్వలి ఉన్నత పాఠశాలలో సమ్మర్ క్యాంప్‌లో బాస్కెట్‌బాల్, టేబుల్ టెన్నిస్‌లో శిక్షణ పొందిన విద్యార్థులకు హెచ్ఎం సర్టిఫికెట్లు అందజేశారు. టేబుల్ టెన్నిస్, బాస్కెట్‌బాల్‌ల్లో శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు గవ్వా శ్రీనివాసరావు, జక్కుల సురేష్‌ను హెచ్ఎం, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

జనజాగృతి సభ పోస్టర్ విడుదల

దెందులూరు: ఎంఆర్‌పీఎస్ 29వ ఆవిర్భావ దినోత్సవం విజయవంతం చేయాలని ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ ఆధ్వర్యంలో జూలై 7న విజయవాడలో జింఖానా గ్రౌండ్స్‌లో జనజాగృతి సభను విజయవంతం చేయాలని ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎర్రా నాగమల్లేశ్వరరావు, కొల్లూరి రామకృష్ణ కోరారు. ఈ సందర్భంగా నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ జనజాగృతి సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. తొలుత ఎంఆర్‌పీఎస్ నాయకులు కొత్తపల్లి గోపిరాజు, చిలకా పోతురాజు, కనుమూరి రాటాలు, వన్నూరి గోపయ్య పోస్టర్లు విడుదల చేశారు.